www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 14 ఆగస్టు 2025
5
ఏలూరు



సమస్యలు పరిష్కరించాలని అధ్యాపకుల ఆందోళన

ప్రజాశక్తి - చింతలపూడి

అధ్యాపకుల సమస్యలను కోరుతూ జెసిటిఎ, జెసిజెటిఎ జెఎసి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు బుధవారం భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని శాఖల ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తయినప్పటికీ డిగ్రీ కళాశాల అధ్యాపకుల బదిలీలు ప్రభుత్వం చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సుదూర ప్రాంతాల్లో ఉన్న అధ్యాపకులు బదిలీలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని గుర్తుచేశారు. జిఒ నెం.42ను వెంటనే రద్దు చేయాలని, డిజిటైజేషన్ ఫైల్‌ను ఆమోదించి వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎన్‌జెకె.నరేంద్రకుమార్, డాక్టర్ బి.మదన్మోహనరావు, కె.రత్నకుమారి, జి.జీవన మౌనిక, జిల్లా జెసిటిఎ మహిళా కార్యదర్శి డి.విన్నీ తేజ పాల్గొన్నారు.

బిటెక్ బెంగ..!



పూర్తికాని రెండో విడత ఇంజినీరింగ్ సీట్ల కౌన్సెలింగ్

ఉమ్మడి జిల్లాలో 13 వేల మంది విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం

కౌన్సెలింగ్ పూర్తి కాకుండానే ఫీజు కట్టాలని కాలేజీల ఒత్తిడి

కౌన్సెలింగ్ పూర్తి కాకుండా, బ్రాంచ్ నిర్ధారణ లేకుండా ఎలాగని తల్లిదండ్రుల ప్రశ్న

మేనేజ్‌మెంట్ కోటా విద్యార్థులకు తరగతులు ప్రారంభం.. కౌన్సెలింగ్ విద్యార్థులు ఇంటికే పరిమితం

విద్యార్థుల గురించి ప్రభుత్వానికి పట్టడం లేదని లేదని విమర్శలు వెల్లువ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఇంటర్ పూర్తి చేసి బిటెక్ ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరే విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ నెల నాలుగో తేదీన పూర్తి కావాల్సిన రెండో విడత కౌన్సెలింగ్ వివిధ కారణాలతో నిలిచిపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడింది. సమస్యను పరిష్కరించి విద్యార్థులకు కౌన్సెలింగ్ పూర్తి చేయాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 14 ఇంజినీరింగ్ కాలేజీలు ఉన్నాయి. వీటిలో 12,900 వరకూ సీట్లు ఉన్నాయి. మేనేజ్‌మెంట్ కోటా 3,870 సీట్లు పోను మిగిలినవి ఎపిఇఎపిసెట్ (ఎంసెట్) పరీక్షల్లో వచ్చే ర్యాంకుల ఆధారంగా భర్తీ చేస్తారు. జులై ఏడో తేదీన మొదటి విడత కౌన్సెలింగ్ ప్రారంభమై 19వ తేదీతో ముగిసింది. 23న సీట్ల కేటాయింపు జరిగింది. జులై 28వ తేదీ వరకూ రిపోర్టింగ్‌కు అవకాశం ఇచ్చారు. తర్వాత 30వ తేదీ నుంచి రెండో విడత కౌన్సెలింగ్‌కు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. తాము కోరుకున్న సీటు రాక, తమకు నచ్చిన కాలేజీ కోసం వేలాది మంది విద్యార్థులు రెండో విడత కౌన్సెలింగ్‌లో పాల్గొని ఆప్షన్లు పెట్టుకున్నారు. ఆగస్టు నాలుగో తేదీన సీట్ల కేటాయింపు ఉంటుందని ప్రభుత్వం చెప్పింది. స్థానికతపై కొంతమంది విద్యార్థులు కోర్టును ఆశ్రయించడంతో రెండో విడత కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపు నిలిచిపోయింది. దీంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉమ్మడి జిల్లాలో 14 ఇంజినీరింగ్ కాలేజీలు ఉండగా, ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో 1,248, సిఆర్ఆర్ కాలేజీలో 912, స్వర్ణాంధ్రలో 1200, విష్ణు కాలేజీలో 864, శశిలో 840, వాసవి కాలేజీలో 768, డిఎన్ఆర్‌లో 552 మొత్తం 12,900 సీట్లు వరకూ ఉన్నాయి. రెండో విడత కౌన్సెలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు 70 శాతానికిపైగా ఉన్నారు. కౌన్సెలింగ్ నిలిచిపోవడంతో విద్యార్థులకు ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది.

కాలేజీల నుంచి తీవ్ర ఒత్తిడి..

నిబంధనల ప్రకారం రెండో విడత కౌన్సెలింగ్‌లో ఆప్షన్ పెట్టుకున్న విద్యార్థులు సీట్ల కేటాయింపు జరిగిన తర్వాత కాలేజీల్లో చేరాల్సి ఉంది. కౌన్సెలింగ్‌లో వేరే కాలేజీ పెట్టుకున్నప్పటికీ మొదటివిడతలో సీటు వచ్చిన విద్యార్థులపై ఆయా కళాశాలలు ఒత్తిడి చేస్తున్నాయి. క్లాసులు ప్రారంభిస్తున్నామని, ఫీజులు కట్టాలని చెబుతున్నాయి. కాలేజీ డెవలప్‌మెంట్ ఫీజు, ప్లేస్‌మెంట్ ట్రైనింగ్, ఇతర ఫీజుల కింద ప్రతి కాలేజీ రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ వసూలు చేస్తున్నాయి. ఈ సొమ్ము వెంటనే కట్టాలని చెబుతున్నాయి. డేస్కాలర్ విద్యార్థులకైతే బస్సు ఫీజు చెల్లించకపోతే మీకు అవకాశం ఉండదని బెదిరిస్తున్న పరిస్థితి ఉంది. తీరా ఈ కాలేజీలో ఫీజు చెల్లించాక వేరే కాలేజీలో సీటు వస్తే పరిస్థితి ఏమిటనే ప్రశ్నకు మాత్రం సమాధానం ఇవ్వడం లేదు. నాలుగో తేదీ నుంచి తరగతులు ప్రారంభమయ్యాయని, రెండో విడత కౌన్సెలింగ్ ఇప్పట్లో తేలుతుందో. లేదో తెలియదని, సీటు వచ్చిన కాలేజీలో చేరిపోవాలని ఒత్తిడి చేయడంతో విద్యార్థులకు ఏం చేయాలో అర్థం కావడం లేదు. కొన్ని కాలేజీలైతే ప్రభుత్వం ఇచ్చే ఫీజు రీయంబర్స్‌మెంట్ సొమ్మును సైతం నాలుగు విడతలుగా కాలేజీలకు విద్యార్థులే చెల్లించాలనే నిబంధన పెడుతున్న పరిస్థితి ఉంది. మేనేజ్‌మెంట్ కోటాలో సీటుకు ఈ ఏడాది కాలేజీని బట్టి రూ.ఐదు లక్షల నుంచి రూ.ఏడు లక్షల వరకూ వసూలు చేసిన పరిస్థితి ఉంది. ఇప్పుడు కౌన్సెలింగ్ ఆలస్యం నేపథ్యంలో విద్యార్థులను ప్రలోభపెట్టి ఫీజులు వసూలు చేయాలని చూస్తున్నారు. విద్యార్థులను ఇంటి వద్ద ఉంచలేక తల్లిదండ్రులు కొంతమంది ఫీజులు కట్టేస్తున్న పరిస్థితి ఉంది. ప్రభుత్వం వెంటనే ఇంజినీరింగ్ రెండో విడత కౌన్సెలింగ్ పూర్తి చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

భారీవర్షం.. జనజీవనం అస్తవ్యస్తం


ఉంగుటూరు మండలంలో

జిల్లాలో బుధవారం సాయంత్రం పలుచోట్ల భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై చిరు జల్లులు పడ్డాయి. సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఒక్కసారిగా భారీవర్షం కురిసింది. దీంతో వివిధ పనుల నిమిత్తం మార్కెట్‌కు వచ్చిన వాళ్లు, ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివాహ ముహూర్తాలు ఉండటంతో ఆయా కుటుంబాలు పడిన బాధలు వర్ణనాతీతం. జిల్లా కేంద్రం ఏలూరులో భారీ వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి.

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమలలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం నాలుగు గంటలకు ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. భారీ వర్షం కురవడంతో డ్రైనేజీలు పొంగి రోడ్లపై వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించింది. డ్రైనేజీలో చెత్తాచెదారం రోడ్లపైకి చేరడంతో జనం రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.

ఉంగుటూరు: బుధవారం సాయంత్రం ఆకాశానికి చిల్లు పడినట్లు కుండపోత వర్షంతో జనజీవనం స్తంభించింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమైనా సాయంత్రం నుంచి భారీ వర్షం కురిసింది. లోతట్టు పొలాల్లో భారీగా వరదనీరు చేరింది. రామచంద్రపురంలో-నల్లజర్ల ఆర్‌అండ్‌బి రోడ్డుపై రామచంద్రపురంలో వర్షపు నీరు నిలిచింది. స్థానిక చిట్టిమ్మచెరువు కాజేవ్ నుంచి భారీగా నీరు చేరింది. నారాయణపురం ఎస్‌సి పేటలో లోతట్టు ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. ఎడతెరిపి లేకుండా వర్షం వల్ల విద్యాసంస్థల నుంచి వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. నారాయణపురం రైల్వే అండర్ పాస్‌లో భారీగా నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈదురుగాలులకు పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి.


ముదినేపల్లి సెంటర్‌లో నిలిచిన వర్షపు నీరు

ముదినేపల్లి: మండలవ్యాప్తంగా బుధవారం సాయంత్రం భారీవర్షం కురిసింది. జాతీయ, రాష్ట్రీయ రహదారులపై వర్షపు నీరు చేరింది. గ్రామాల్లోని అంతర్గత రోడ్లపై వర్షపు నీరు ప్రవహించడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంగళవారం రాత్రి కుండపోత వర్షం కురవడం, మళ్లీ బుధవారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ముదినేపల్లి పరిసర గ్రామాల్లోని పలు కాలనీ ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షంతో వరి చేలు జీవం పోసుకున్నాయి.

16న పోలవరం నిర్వాసిత కాలనీల్లో సిపిఎం నేతల పర్యటన

విచ్చేయనున్న సిపిఎం ఫ్లోర్ లీడర్, రాజ్యసభ ఎంపీ జాన్ బ్రిట్టాస్, రాష్ట్ర, జిల్లా నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాజ్యసభ ఎంపీ, సిపిఎం ఫ్లోర్ లీడర్ జాన్‌బ్రిట్టాస్ ఈ నెల 16న జిల్లాలోని పోలవరం నిర్వాసిత కాలనీలు, గిరిజన ప్రాంతాల్లో పర్యటిస్తారని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16వ పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత కాలనీల్లో సమస్యలు, పునరావాసం, ఎల్‌టిఆర్ భూసమస్యలను పరిశీలించడానికి జాన్ బ్రిట్టాస్ విచ్చేయనున్నారని పేర్కొన్నారు. జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల్లో ప్రజలను కలుసుకొని, వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారని తెలిపారు. 16వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం చేరుకుని, అక్కడ ఆర్‌అండ్‌ఆర్ భూముల పరిశీలన అనంతరం రెడ్డిగణపవరం సెంటర్లో సభలో పాల్గొంటారని పేర్కొన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు జీలుగుమిల్లి మండలంలోని టేకూరు కాలనీ సందర్శిస్తారని, అక్కడ పరిసర గ్రామాల నిర్వాసిత కాలనీల ప్రజానీకంతోపాటు పరిసర గ్రామాల ఎల్‌టిఆర్ భూములు సాగు చేస్తున్న గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలపై అడిగి తెలుసుకుంటారని తెలిపారు. నిర్వాసితులకు ఎల్‌టిఆర్ భూములు కొన్నిచోట్ల సేకరిస్తుండటం వల్ల పలు సమస్యలు ఎదురవుతున్నాయని, ఈ అంశంపైనా ఆయన పరిశీలిస్తారని పేర్కొన్నారు. అనంతరం సభలో మాట్లాడతారని తెలిపారు. అనంతరం కుక్కునూరు మీదుగా భద్రాచలం వెళ్తారని పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఎంపీ బ్రిట్టాస్‌తోపాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, బి.బలరాం పాల్గొంటారని, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, ఏజెన్సీ ప్రాంత నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలి

జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు

అధికారులతో కలెక్టర్ కె.వెట్రిసెల్వి టెలికాన్ఫరెన్స్

ప్రజాశక్తి - ఏలూరు



జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో పరిస్థితిని అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ కె.వెట్రిసెల్వి బుధవారం రాత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో ఎక్కడా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు లేకుండా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ శాఖాధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఏలూరుతోపాటు డివిజనల్ స్థాయిలో 24 గంటలపాటు పని చేసేలా కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ 18002331077 టోల్ ఫ్రీ నెంబర్‌తో, 9491041419తో ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్‌లో విద్యుత్, వైద్యఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. జిల్లాలోని 108 వాహనాల జాబితా, డ్రైవర్ల ఫోన్ నెంబర్లను అందుబాటులో ఉంచాలని డిఎంహెచ్‌ఒను కలెక్టర్ ఆదేశించారు. పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని, గంటకు 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిందని తెలిపారు. పిడుగులతో కూడిన వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇప్పటి నుంచే రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా రెవెన్యూ సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి మండల, డివిజన్ ప్రధాన కేంద్రాల్లో రెవెన్యూ సిబ్బంది 24/7 అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల ఎలాంటి నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండి ముందస్తుగానే పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. తమ్మిలేరు, బుడమేరు, ఏలూరు కాలువ ఉధృతంగా ప్రమాదకర పరిస్థితుల్లో ప్రవహించే అవకాశం ఉన్న దృష్ట్యా, ఆకస్మిక వరదల సమాచారాన్ని దిగువ ప్రాంతాల ప్రజలకు తెలియజేస్తూ అప్రమత్తం చేయాలన్నారు. కొల్లేరులో ముంపు ప్రాంతాలను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. బుట్టాయగూడెం, కొయ్యలగూడెం ప్రాంతాల్లో కొండవాగులు పొంగి ప్రవహించే అవకాశం ఉన్న దృష్ట్యా ఆ ప్రాంతాల్లో ప్రజలు వాగులు దాటకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. శనివారం నుండి ఉప్పుటేరుపై ఆక్రమణలు తొలగించేందుకు ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు.

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం

క్విట్ కార్పొరేట్స్ అంటూ ఎస్‌కెఎం, కార్మిక సంఘాల ఆధ్వర్యాన నిరసన : మోడీ, ట్రంప్ దిష్టిబొమ్మల దహనం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


దిష్టిబొమ్మలు దహనం చేస్తున్న నేతలు

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కుదుర్చుకుంటున్న విదేశీ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో దేశ వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం), కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు 'క్విట్ కార్పొరేట్స్' పేరిట బుధవారం స్థానిక పాత బస్టాండ్ సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. మోడీ, ట్రంప్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, బికెఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఎఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి బద్దా వెంకట్రావు, రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ భాషా, అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.గౌస్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహన్‌రావు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్‌డాంగే మాట్లాడారు. ట్రంప్, మోడీ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ ఒప్పందాల వల్ల వ్యవసాయ రంగానికి తీవ్ర ప్రమాదం ఏర్పడిందన్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కార్పొరేట్ కంపెనీలకు ఉపయోగపడతాయన్నారు. పది సంవత్సరాల నాటి ట్రాక్టర్లను రద్దు చేయాలని, వాటి స్థానంలో కొత్త ట్రాక్టర్లను కొనుగోలు చేయాలని రైతులను ఆదేశించే విధానాలు దుర్మార్గమని విమర్శించారు. వాణిజ్య ఒప్పందాలు వ్యవసాయానికి, రైతులకు వినాశకరంగా ఉండకూడదని హితవు పలికారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల వల్ల ఆక్వా, వ్యవసాయ రంగాలు తీవ్రంగా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశ సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెట్టేలా బహుళజాతి సంస్థలు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు లొంగి వ్యవహరించడం తగదన్నారు. ట్రంప్ సుంకాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని పంటలకు మద్దతు ధరలు కల్పించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకు రుణాలు రద్దు చేయాలని కోరారు. కార్మికులకు నష్టం చేకూర్చే కార్మిక చట్టాలు మార్పును మోడీ ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు కట్టా భాస్కరరావు, కోన శ్రీనివాసరావు, ఎం.రవి, పుప్పాల కన్నబాబు, వివిఎన్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలు నిర్వహించకుండానే భూసేకరణా..?

రెవెన్యూ సిబ్బందిని అడ్డుకున్న గిరిజనులు

తీరు మార్చుకోకుండా ప్రత్యక్ష ఆందోళన చేపడతాం: సిపిఎం


ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పీసా చట్ట ప్రకారం గ్రామసభలు నిర్వహించకుండా భూసేకరణ ఎలా చేపడతారని గిరిజనులు నిలదీయడంతో మండలంలోని అంతర్వేదిగూడెం గ్రామం ఇనుమూరులో సర్వేకు వచ్చిన రెవెన్యూ సిబ్బంది వెనుదిరిగారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఇనుమూరులో ఆ గ్రామ గిరిజనులు సుమారు 25 ఏళ్లుగా ప్రభుత్వ గయాళా భూములను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఎస్‌డిసి కోర్టులో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ క్రమంలో సర్వేనెంబర్ 222లో ఏడెకరాల భూమిని ఆర్‌అండ్‌ఆర్‌లో కొనుగోలు చేయడానికి విఆర్‌ఒ, సర్వేయర్లు సర్వే చేపట్టారు. దీనిపై అక్కడికి చేరుకున్న స్థానిక గిరిజనులు వివాదాల్లో ఉన్న భూమిని ఆర్‌అండ్‌ఆర్‌లో ఎలా కొనుగోలు చేస్తారని నిలదీయడంతో వారంతా అక్కడ నుంచి వెనుదిరిగారు.


సర్వేను అడ్డుకున్న గిరిజనులు,నేతలు

గ్రామసభ అనుమతి లేకుండా భూసేకరణ తగదు: సిపిఎం

పీసా చట్ట ప్రకారం గ్రామసభ అనుమతులు లేకుండా ఎటువంటి భూసేకరణా చేయరాదని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, ఇనుమూరు పీసా కార్యదర్శి కారం ముత్యాలరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామసభలు నిర్వహించకుండా గిరిజన చట్టాలకు విరుద్ధంగా భూసేకరణ చేయడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. తక్షణమే ఆర్‌అండ్‌ఆర్ సర్వే ఆపాలని వారు కోరారు. గ్రామసభలు నిర్వహించాకే భూసేకరణ చేస్తామని ఉన్నతాధికారులు చెబుతుంటే, తహశీల్దార్, విఆర్‌ఒలు గిరిజన చట్టాలను అధిగమించి గిరిజనేతరులకు, భూస్వాములకు కొమ్ముకాస్తున్నారని, గ్రామసభ జరపకుండా భూములపై సర్వేలు నిర్వహిస్తున్నారని విమర్శించారు తక్షణం ఇటువంటి చర్యలు ఆపకపోతే సిపిఎం ఆధ్వర్యాన పెద్దఎత్తున ఆందోళన చేపడతామని అధికారులను హెచ్చరించారు.


ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరించిన ఐజి అశోక్‌కుమార్

మీడియాలో ప్రత్యేక స్థానం ప్రజాశక్తి సొంతం

45వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక ఆవిష్కరణలో ఐజి జివిజి.అశోక్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్, స్పోర్ట్స్

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, ప్రతి అక్షరం ప్రజల పక్షంగా ముందుకు సాగుతున్న ప్రజాశక్తి దినపత్రికకు మీడియాలో ఒక ప్రత్యేక స్థానం ఉందని ఏలూరు రేంజ్ ఐజి జివిజి.అశోక్‌కుమార్ అన్నారు. నగరంలోని ఏలూరు రేంజ్ పోలీస్ కార్యాలయంలో ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ మెరుగైన సమాజం నిర్మించడంలో పత్రికా రంగానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ విషయంలో జర్నలిస్టులు ముఖ్య పాత్ర పోషిస్తున్నారన్నారు. విలువలతో కూడిన జర్నలిజాన్ని ప్రతిఒక్కరూ అవలంబిస్తూ సమాజంలో మీడియా పాత్రను ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. ప్రజాశక్తికి వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాశక్తి జిల్లా మేనేజర్ పి.నారాయణరాజు, డెస్క్ ఇన్‌ఛార్జి విఎస్ఎస్‌వి.ప్రసాద్, సిబ్బంది, విలేకరులు ఎం.సాంబమూర్తి, టి.సత్యవతి, యు.శ్రీనివాస్, సిహెచ్.శ్రీకాంత్, వి.శ్యాంబాబు పాల్గొన్నారు.

సిఆర్ఆర్ ఫార్మసీ కళాశాలకు అటానమస్ హోదా


ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నగరంలో విద్యారంగంలో విశిష్ట గుర్తింపు పొందిన సిఆర్ రెడ్డి ఫార్మసీ కళాశాల మరో మెట్టు ఎక్కింది. కొన్ని సంవత్సరాలుగా విద్యా ప్రమాణాలు, పరిశోధనల్లో విశేషంగా రాణిస్తున్న ఈ సంస్థకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ అటానమస్ (స్వయం ప్రతిపత్తి) హోదా మంజూరు చేసింది. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిఆర్‌ఆర్ విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ ఎంబిఎస్‌వి.ప్రసాద్ మాట్లాడుతూ సిఆర్‌రెడ్డి ఫార్మసీ కళాశాలకు అటానమస్ హోదా లభించడం తమకు గర్వకారణమన్నారు. ఇది తమ అధ్యాపకుల నిబద్ధత, విద్యార్థుల ప్రతిభ, పరిపూర్ణంగా ఉన్న మౌలిక వసతులకు గుర్తింపుగా భావిస్తున్నామన్నారు. ఈ విజయంతో విద్యా ప్రమాణాలు మరింత మెరుగవుతాయని, పరిశోధన, నైపుణ్యాభివృద్ధిలో సరికొత్త దిశగా ప్రయాణిస్తామని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు మాట్లాడుతూ ఈ అటానమస్ హోదాతో తమ విద్యార్థులకు స్వతంత్రంగా ఆచరణాత్మక విద్య అందించే అవకాశం ఏర్పడిందన్నారు. పరిశ్రమల అవసరాలను బట్టి సిలబస్ రూపొందించుకునే స్వేచ్ఛ వల్ల వారి భవిష్యత్తు మరింత బలపడుతుందని, విద్యార్థులకు ఇది గొప్ప అవకాశమని చెప్పారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి 2034-35 వరకు మొత్త 10 సంవత్సరాలపాటు సిఆర్‌ఆర్ ఫార్మసీ కళాశాలకు అటానమస్ హోదా మంజూరైందని తెలిపారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.నరేంద్రబాబు మాట్లాడుతూ తమ కళాశాలకు అటానమస్ హోదా లభించడం ఒక గొప్ప గౌరవమన్నారు. ఇది తమ అధ్యాపక, అధ్యాపకేతర బృందం అంకితభావం, విద్యార్థుల కృషి, కాలేజీ నిర్వహణ, పరిపాలనలోని నాణ్యతకు గుర్తింపన్నారు. పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, జాతీయ, అంతర్జాతీయ ఫార్మసీ సంస్థలు, పరిశోధనా సంస్థలతో అవగాహనా ఒప్పందాలకు మరింత ప్రాధాన్యం ఇస్తామని, విద్యా ప్రమాణాల్లో కొత్త అధ్యాయం ప్రారంభించబోతున్నామని తెలిపారు. సిఆర్‌ఆర్ విద్యాసంస్థల సెక్రటరీ ఎంబిఎస్‌వి.ప్రసాద్, ఫార్మసీ కళాశాల కరస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు మాట్లాడుతూ ఈ గుర్తింపు లభించడానికి కృషి చేసిన అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి అభినందనలు తెలిపారు.

స్వీపింగ్ మిషన్, మరుగుదొడ్లు ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన 15వ ఆర్థిక సంఘం, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులు రూ.51 లక్షలతో మూడు టన్నుల సామర్థ్యం కలిగిన స్వీపింగ్ మిషన్, బిఒటి పద్ధతిలో వన్‌టౌన్ చేపల మార్కెట్ ప్రాంతంలో నిర్మించిన స్వచ్ఛభారత్ పే అండ్ యూజ్ టాయిలెట్స్‌ను ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణ, నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, ఇక్కడకు వస్తున్న ప్రజలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రజల భాగస్వామ్యంతో నిర్మించిన టాయిలెట్స్‌ను ప్రారంభించామన్నారు. మార్కెట్ ప్రాంతంలో ఈ టాయిలెట్స్ నిర్మించడానికి ప్రధానోద్దేశం వివిధ ప్రాంతాలు, ఇతర ప్రదేశాల నుండి మార్కెట్‌కు వచ్చిన ప్రజలు, వ్యాపారస్తుల కోసమని అన్నారు. కార్పొరేషన్ స్థలం కేటాయిస్తూ అనుమతివ్వగా ప్రయివేటు వ్యక్తి రూ.20 లక్షలతో ఈ టాయిలెట్లు నిర్మించారన్నారు. రూ.51 లక్షలతో కొనుగోలు చేసిన మూడు టన్నుల సామర్థ్యం కలిగిన స్వీపింగ్ మిషన్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. శానిటేషన్ విషయంలో మున్సిపల్ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, పలువురు కార్పొరేటర్లు, టిడిపి నేతలు పాల్గొన్నారు.


పబ్లిక్ టాయిలెట్స్‌ను ప్రారంభిస్తున్న మేయర్, ఎంఎల్‌ఎ

జిల్లా కేంద్ర ఆసుపత్రిలో జెడ్‌పి ఛైర్‌పర్సన్ తనిఖీలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ


జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రిని జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, ఆస్పత్రిలో సదుపాయాలు, పరిసరాల పరిశుభ్రత, తాగునీటి వసతి మొదలైన అంశాలను పరిశీలించారు. ఆసుపత్రి నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సూపరింటెండెంట్ ఎంఎస్.రాజు బెడ్స్ కొరత గురించి వివరించారు. దీనిపై స్పందించిన ఛైర్‌పర్సన్ స్పందించి మాట్లాడుతూ అదనపు బెడ్స్ ఏర్పాటుకు షెడ్ నిర్మాణానికి అవసరమైన అంచనాలు సిద్ధం చేసి పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఘంటా ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు బకాయి వేతనాలు ఇవ్వాలని ధర్నా

ఏలూరు అర్బన్: ఉపాధి హామీ కూలీలకు 10 వారాలకుపైగా బకాయి పడ్డ వేతనాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ రైతుకూలీ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి సంఘం జిల్లా నాయకులు మిడియం రవిదొర అధ్యక్షత వహించగా, జిల్లా కార్యదర్శి షేక్ భాషా మాట్లాడారు. తక్షణమే ఉపాధి హామీ కూలీల బకాయిలను చెల్లించాలని, ఉపాధి హామీ సిబ్బంది వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సవలం రాంబాబు మాట్లాడారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ వెట్రిసెల్వికి, డ్వామా పీడీకి అందించారు.

డ్రైవర్లకు ఉపాధి చూపాలని వినతి

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జామాయిల్ మొక్కల రవాణా స్థానిక వాహనాలతో సరఫరా చేయించి స్థానిక డ్రైవర్లకు ఉపాధి చూపించాలని సిఐటియు మండల కన్వీనర్ యర్నం సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లారీ, మినీ వ్యాన్, బొలెరో డ్రైవర్ల సమస్యలపై తహశీల్దార్ రమేష్‌బాబుకు సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ రవాణా రంగం డ్రైవర్లు ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటివారు. వారు అప్పులు చేసి వాహనాలు కొనుగోలు చేసి అవి తీర్చడానికి అవసరమైన పనుల్లేక, కుటుంబ పోషణ గడవక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మండలంలో బోనగిరి, రాయిగూడెం, ఇబ్రహీంపేట, గణపవరం, బంజరగూడెం, అల్లిగూడెం, వేలేరు గ్రామాల్లో వెయ్యికి పైగా జామాయిల్ నర్సరీలు ఉన్నాయని, ఆ మొక్కలను మన రాష్ట్రంలో ఇతర జిల్లాలకు, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారని తెలిపారు. స్థానికంగా ఉన్న లారీలు, బొలెరో, టాటా ఎసి, మినీ వ్యాన్‌లకు కాకుండా బయట వాహనాలతో రవాణా చేస్తున్నారన్నారు. దీంతో స్థానిక డ్రైవర్లు ఉపాధి లేక కుటుంబ పోషణ గడవక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మండలంలో ముందుగా స్థానికంగా ఉన్న వాహనాలతోనే జామాయిల్ మొక్కలు, ఇతర వస్తువులు రవాణా చేయించి వారికి ఉపాధి చూపించాలని, లేకుంటే సమస్య పరిష్కరమయ్యేవరకూ ఆందోళనలు చేపడతామని సాయికిరణ్ హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో లారీ యూనియన్ అధ్యక్షులు, కార్యదర్శి నిర్మల వెంకటేశ్వర్లు, మహమ్మద్ వలీపాషా, ఓగిరాల నాగరాజు, తాండ్ర నాగరాజు, కొప్పెరా శ్రీను, గంజి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

సిఐ యుజె.విల్సన్

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులు చేపడుతున్న చర్యలకు జాతీయ రహదారులపై రెస్టారెంట్లు, దాబాలు నిర్వహిస్తున్న నిర్వాహకులు సహకరించాలని భీమడోలు సిఐ యుజె.విల్సన్ కోరారు. ఈ విషయమై భీమడోలు సర్కిల్ కార్యాలయంలో బుధవారం సదరు నిర్వాహకులతో ప్రత్యేక సమావేశాన్ని సర్కిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాహకులు తమ వ్యాపార స్థలాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అపరిచితులు, అనుమానితుల పట్ల అప్రమత్తంగా ఉండటంతో పాటు వారి వివరాల గురించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో భీమడోలు ఎస్ఐ సుధాకర్ పాల్గొన్నారు.తో పాటు, యుగంధర్, ధర్మారావు పాల్గొన్నారు.

రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటా

చింతలవల్లి సొసైటీ ఛైర్మన్ రమేష్


ప్రజాశక్తి - ముసునూరు



బాధ్యతలు స్వీకరిస్తున్న రమేష్

రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ సకాలంలో రుణాలు ఇస్తామని చింతలవల్లి సొసైటీ ఛైర్మన్ బర్మా రమేష్ అన్నారు. మండలంలోని చింతలవల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సొసైటీ ఛైర్మన్ గా బర్మా రమేష్, చైర్‌పర్సన్లుగా జోనుబోయిన రంగారావు, పల్లిపాము పెంటమ్మ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా బర్మా రమేష్ సొసైటీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని చెప్పారు. రైతులకు ఖరీఫ్, రబీ పంట రుణాలు అందిస్తామన్నారు. నూతన కమిటీని టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు, ఎంపిటిసి మాజీ సభ్యులు బుజ్జియ, టిడిపి నాయకులు కొండేటి బాబి అభినందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి కె.ప్రసాదరావు, సిబ్బంది శ్రీను, రైతులు పాల్గొన్నారు.

సొసైటీల ఛైర్మన్ల బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల


జి.కొత్తపల్లి సొసైటీ ఛైర్మన్ రాంబాబు


రామన్నగూడెం సొసైటీ ఛైర్మన్ రామారావు

జి.కొత్తపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్మన్‌గా రేగంటి రాంబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రామన్నగూడెం సొసైటీ ఛైర్మన్‌గా బొబ్బ వీరవెంకట రామారావు (మద్రాస్ రాము) బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమాల్లో గోపాలపురం ఎంఎసి ఛైర్మన్ యుద్దనపూడి బ్రహ్మరాజు, టిడిపి మండలాధ్యక్షులు లంక సత్యనారాయణ, ద్వారకాతిరుమల సొసైటీ ఛైర్మన్ పోలిన శ్రీనివాసరావు, తిరుమలపాలెం సొసైటీ ఛైర్మన్ మాసిరెడ్డి హరిబాబు, దేవరపల్లి వీరస్వామిచౌదరి, మొగతడకల శ్రీనివాసరావు, ఏపూరి దాలయ్య, బద్రి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

గంజాయి విక్రేతలు అరెస్టు

755 గ్రాముల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - మండవల్లి

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 755 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మండవల్లి పోలీస్‌స్టేషన్‌లో సిఐ రవికుమార్ బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. సిఐ తెలిపిన వివరాల ప్రకారం.... కైకలూరు వెలమపేటకు చెందిన షేక్ ఫరీద్ అబ్బాస్, కలిదిండి మండలం చైతన్యపురానికి చెందిన ఎలికే రాజేష్ డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతూ చెడు అలవాట్లకు బానిసలై గంజాయి తాగుతూ విక్రయిస్తున్నారు. 2023లో అబ్బాస్ గంజాయి విక్రయిస్తుండగా విశాఖపట్నం జిల్లా పెందుర్తి పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేయడంతో జైలుకు కూడా వెళ్లి వచ్చాడు. ఎలికే రాజేష్ గంజాయి మత్తులో కోరుకొల్లుకు చెందిన ఒక వ్యక్తిపై దాడి చేసిన కేసులో కలిదిండి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గంజాయి విక్రయిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. అయినప్పటికీ మీరు గంజాయి తాగడం, విక్రయించడం వంటివి చేస్తున్నారు. ఒడిశా రైల్వే స్టేషన్ నుంచి గంజాయి తీసుకొస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్, ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో కైకలూరు రూరల్ సిఐ రవికుమార్, ఎస్ఐ రామచంద్రరావు సిబ్బందితో రెక్కీ నిర్వహించి చావలపాడు వద్ద ఉన్న ఖాళీ స్థలంలో గంజాయితో ఉన్న ఇద్దరిని బుధవారం అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 755 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిపై ఎన్‌డిపిఎస్ చట్ట ప్రకారం కేసు నమోదు చేసి కైకలూరు న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు సిఐ తెలిపారు.

స్వీట్ల దుకాణంలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

స్వీట్ల దుకాణంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుని సుమారు రూ.రెండు లక్షల నష్టం వాటిల్లింది. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం... నగరంలోని కన్నయ్య పార్క్ వద్ద గృహలక్ష్మి స్వీట్స్ పేరుతో స్వీట్ల దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం షార్ట్ సర్క్యూట్ కారణంగా దుకాణంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అప్రమత్తమైన స్థానికులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు. సుమారు రూ.రెండు లక్షల ఆస్తి నష్టం ఉంటుందని ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని చంద్రమ్మ కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని అంకన్నగూడెం గ్రామానికి చెందిన కె.శ్రీనును అతని భార్య వదిలేయడంతో కొంతకాలంగా చంద్రమ్మ కాలనీలోని బంధువుల ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం పురుగుల మందు తాగి రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు జీలుగుమిల్లి పిహెచ్‌సికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి నుంచి జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రైతుల అభ్యున్నతికి కృషి

మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రైతుల అభ్యున్నతి, వ్యవసాయ అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు, పంట ఉత్పాదకతను మెరుగుపరచేందుకు, మార్కెట్ సౌకర్యాలను విస్తరించేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ఇటీవలే రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేశామని పేర్కొన్నారు. జిల్లాలో 1,60,968 మంది రైతులకు రూ.107.08 కోట్లు అన్నదాత సుఖీభవ నిధులు జమ చేసినట్లు తెలిపారు. నూజివీడు నియోజకవర్గంలో సుమారు 35,529 మంది రైతులకు రూ.23.64 కోట్లు జమ చేశామని పేర్కొన్నారు. అర్హత కలిగి అన్నదాత సుఖీభవ అందని రైతులు స్థానిక అగ్రికల్చర్ అధికారులను సంప్రదించి తమ ఇబ్బందులు తెలియజేయాలని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ప్రస్తుత సంవత్సరంలో రాష్ట్రంలోని 3.5 లక్షల మంది రైతులను ప్రకృతి వ్యవసాయంలోని తీసుకురావడమే లక్ష్యంగా రైతు సేవాధికార సంస్థ పని చేస్తుందని ఆ సంస్థ ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రాజెక్ట్ అధికారి రాథోడ్ ప్రవీణ్ చెప్పారు. మండలంలోని గుండుగొలనుకుంట వద్ద ఉన్న బయో రిసోర్స్ సెంటర్ యూనిట్‌లో ఎన్‌టిఆర్, ఏలూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల నుంచి వచ్చిన 50 మంది బయో రిసోర్స్ సెంటర్ యజమానులకు బుధవారం శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాథోడ్ ప్రవీణ్ మాట్లాడుతూ సర్వ మానవాళికి ఆరోగ్యాన్ని అందించే ప్రకృతి వ్యవసాయం వైపు రైతులం దరూ మొగ్గు చూపేలా వ్యవసాయశాఖాధికారులు కృషి చేయాలన్నారు. శిక్షణా కార్యక్రమంలో ఏలూరు ప్రకృతి వ్యవసాయ డిపిఎం వెంకటేష్, బయో రిసోర్స్ సెంటర్ యజమానులు గోపాల్‌కృష్ణ, వెంకటరత్నాజీ పాల్గొన్నారు.

భూ ఆక్రమణలు ఆపాలి : సిపిఎం

ప్రజాశక్తి - టి.నర్సాపురం

మండలంలోని ఎపిగుంట పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూముల ఆన్‌లైన్ వ్యవహారాలు నిలుపుదల చేయాలని, సమగ్ర విచారణ జరిపి పేదలకు పంచాలని సిపిఎం జిల్లా నాయకులు గూడెల్లి వెంకట్రావు, మండల కార్యదర్శి మడకం సుధారాణి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ఎపిగుంట రెవెన్యూ పరిధిలో దళిత, గిరిజన పేదల సాగులో ఉన్న ప్రభుత్వ భూమిని కూటమి నాయకులు దోచేస్తున్నారని పేర్కొన్నారు. ఎపిగుంట పంచాయతీ బచ్చులాటిగూడెం గిరిజనులు, దళిత పేదల సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములను ఇటీవల కొందరు కూటమి నేతలు రెవెన్యూ అధికారుల అండదండలతో తమ పేర్లతో రాయించుకుంటున్నారని తెలిపారు. అధికార పార్టీ కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతుందని పేర్కొన్నారు. రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 500 రెవెన్యూ ఫారెస్ట్ భూములు అర్హత కలిగిన పేదలకు దక్కేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కలెక్టర్ వెంటనే దృష్టి సారించాలని, ఆన్‌లైన్ ద్వారా భూ బదలాయింపు నిలుపుదల చేసి ఆ భూములపై సమగ్ర విచారణ జరపాలని, అర్హులైన పేదలకు పంచాలని తెలిపారు.

ఎంఇఒ-1గా సురేష్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - మండవల్లి

మండవల్లి ఎంఇఒ-1గా చెన్నకేశవుల సురేష్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆటపాక ప్రభుత్వ పాఠశాలలో ఎస్ఎ ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. చెన్నకేశవుల సురేష్‌కు సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.


ర్యాలీలో ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

నెలాఖరుకు సెంట్రల్ లైటింగ్ పూర్తి

ప్రజాశక్తి - చింతలపూడి

ఈ నెలాఖరు నాటికి చింతలపూడి సెంట్రల్ లైటింగ్ రూ.30 లక్షలతో పూర్తవుతుందని ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ తెలిపారు. పేదల, రైతుల సంక్షేమం కోసం టిడిపి కూటమి నిరంతరం కృషి చేస్తుందన్నారు. అన్నదాత సుఖీభవ నగదు రైతుల ఖాతాలో పడిన సందర్భంగా బుధవారం ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ చింతలపూడిలో బస్సు డిపో మంజూరు చేయిస్తానని చెప్పారు.

మాదకద్రవ్యాలను అరికట్టడం అందరి బాధ్యత

'నషా ముక్తి భారత్ అభియాన్'లో కలెక్టర్ వెట్రిసెల్వి


ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, ఎస్‌పి, ఎంఎల్ఎ, తదితరులు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం అందరి బాధ్యత అని కలెక్టర్ వెట్రిసెల్వి చెప్పారు. విద్యార్థులు డ్రగ్స్ వినియోగంతో భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈగల్ టీమ్, పోలీసులు సంయుక్తంగా నగరంలోని సర్ సిఆర్ఆర్ కళాశాల గ్రౌండ్‌లో నషా ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. విద్యార్థులతో డ్రగ్స్ వద్దు బ్రో అంటూ ప్రమాణం చేయించారు. అనంతరం సే నో టు డ్రగ్స్ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం ఎక్కడైనా గుర్తిస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఇందుకోసం రాష్ట్రస్థాయిలో 1972, నషా ముక్త్ భారత్ అభియాన్ టోల్ ఫ్రీ నెంబర్ 14446, నాటుసారా నిరోధానికి 14405 నెంబర్లను ఏర్పాటు చేశారన్నారు. ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల రహిత ఏలూరు జిల్లాను ఏర్పాటు చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల ఒకవ్యక్తికే కాకుండా ఆకుటుంబం, సమాజానికి చేటు చేస్తుందని తెలిపారు. డ్రగ్స్ జోలికి వెళ్లకుండా యువత బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఏలూరు డిఎస్‌పి డి.శ్రావణ్‌కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆవులయ్య, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పాండు రంగారావు, ఈగల్ టీమ్ ఆర్ ఎస్ఐ ఉదయ భాస్కర్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఎడి బి.రామ్‌కుమార్, సెట్‌వెల్ సిఇఒ కె.ప్రభాకరరావు, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ఎం.ముక్కంటి, ఎల్‌డిఎం డి.నీలాద్రి, డిపిఒ కె.అనురాధ, డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్‌కుమార్, డిఎంహెచ్ఒ డాక్టర్ పిజె.అమృతం, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్.జితేంద్ర, హెడ్ కానిస్టేబుల్ సూర్య చక్రి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు, త్రీ టౌన్ ఎస్ఐ రాంబాబు, ఎక్సైజ్ శాఖ ఎస్ఐలు, జిల్లా అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లీజు వాటాలు అందరికీ సమానంగా పంచాలి

కలెక్టరేట్ వద్ద ఫీల్డ్ లేబర్ కోపరేటివ్ సొసైటీ సభ్యుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


ధర్నా చేస్తున్న ఫీల్డ్ లేబర్ కోపరేటివ్ సొసైటీ సభ్యులు

గత 40 ఏళ్ల నుంచి కొనసాగుతున్నట్లే భూముల లీజు వాటాలు అన్ని కుటుంబాలకు సమానంగా పంచుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మండవల్లి మండలం ఉనికిలి గ్రామానికి చెందిన దళితులు బుధవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత మహాసభ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కోరబండి బాబూరావు మాట్లాడుతూ ఉనికిలి గ్రామంలో మాల, మాదిగ, మాలదాసు సామాజిక తరగతికి చెందిన తాము ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సభ్యులుగా ఉన్నామని, 150 ఎకరాల భూమి కేటాయించి, అందులో జిగ్ జాగ్ (పట్టా తప్పించి పట్టాలను) 69 ఎకరాలకు మాత్రమే మనిషికి ఎకరం చొప్పున ఇచ్చారని, ఆనాటి నుంచి నేటి వరకు 330 మంది కుటుంబాలు దానిపై వచ్చే ఫలసాయం తామంతా సమానంగా అనుభవిస్తున్నామని తెలిపారు. సొసైటీ ప్రెసిడెంట్, సెక్రటరీలను ఎన్నుకోవడం, ఆడిట్ చేయించడం వంటివి అన్నీ సక్రమంగా జరుగుతున్నాయని, కొంతకాలం క్రితం వేరే గ్రామానికి చెందిన వ్యక్తులు తమ సొసైటీలో 76.14 ఎకరాల నకిలీ పట్టాలు సృష్టించి మా సొసైటీ భూమిని కాజేయాలని ప్రయత్నించారని, ప్రభుత్వ అధికారులు విచారణ చేసి ఆ నకిలీ పట్టాలు రద్దు చేశారని తెలిపారు. కాని ఇప్పుడు నకిలీ పట్టాదారులు మా సొసైటీ పట్టాదారులను ఎవరి ఎకరం లీజు వారే తీసుకోవాలని, అందరికి పంచవద్దని చెప్పి, డబ్బు ఆశ పెట్టి 69 ఎకరాల పట్టాదారులను రెచ్చగొడుతున్నారని, పట్టాదారులు ఎవరి ఎకరం లీజు వాళ్ళు తీసుకుంటే నకిలీ పట్టాదారులు 76.14 ఎకరాలు కాజేయడానికి వీలుగా ఉంటుందనే దురుద్దేశంతో ఎత్తుగడలు వేస్తున్నారని తెలిపారు. తమకు ఈ సొసైటీయే జీవనాధారమని, తమ సొసైటీ పట్టాదారులపై తగు చర్యలు తీసుకుని లీజు డబ్బులు అన్ని కుటుంబాలకు పంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సొసైటీ జనరల్ బాడీ మీటింగ్, సొసైటీ రెన్యువల్ ఆడిట్ తదితర లావాదేవీలు సక్రమంగా జరిపించాలని, ఓటు హక్కు ఉండి మరణించిన వారి స్థానంలో కొత్త వారికి ఓటు హక్కు కల్పించి, లీజు వాటాలు ఇప్పించి తమకు జీవనాధారం కల్పించి న్యాయం చేయాలని కోరారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ ధర్నాలో గ్రామస్తులు కె.రాజబాబు, గుడిపూడి యోహాను, వి.యోసేపు, కె.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు ఆర్థిక సాయం చేయాలి

సిఐటియు జిల్లా నాయకులు సాయికిరణ్

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్


జెండా ఆవిష్కరిస్తున్న నేతలు

ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించిన రోజునే ఆటో కార్మికులకు హామీ ఇచ్చిన ప్రకారం ఆర్థిక సాయం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు వై.సాయికిరణ్ కోరారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో సిఐటియు తొమ్మిదో మండల మహాసభ సువ్వేటి లత, బోగరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సాయికిరణ్ మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో కార్మికులు నష్టపోకుండా చూడాలన్నారు. అనంతరం 14 మందితో సిఐటియు మండల కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా సువ్వేటి లత, కో-కన్వీనర్‌గా బోగరి వెంకటేశ్వరరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీని ప్రజా సంఘాల నాయకులు అభినందించారు. తొలుత సిఐటియు జెండా ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు మడివి దుర్గారావు, సిపిఎం మండల కార్యదర్శి ధర్మల రమేష్, ఫ్రెండ్స్ ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుంచాలి

ఎంపిడిఒలకు పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు ఆదేశం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుంచాలని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు ఎంపిడిఒలను ఆదేశించారు. మండలంలోని బర్రింకలపాడులోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఎంపిడిఒలతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో ఉన్న సమస్యలపై ఆరా తీశారు. మండలాల్లోని ఆయా గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన ఏడాది కాలంలోనే ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. త్వరలో మరిన్ని నిధులు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుంచడానికి కృషి చేస్తానన్నారు. అధికారులు కూడా అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల ఎంపిడిఒలు, జనసేన పార్టీ అధికార ప్రతినిధి గడ్డమణుగు రవి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో పెండింగ్ పనులను పూర్తి చేయాలి

ఉపాధి హామీ నిధులతో నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టి పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఎల్ఎ చిర్రి బాలరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. బర్రింకలపాడులోని ఆయన క్యాంపు కార్యాలయంలో పంచాయతీ రాజ్, ఉపాధి హామీ అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ ద్వారా చేసిన పనులకు సంబంధించి బకాయిల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే ఉపాధి హామీకి సంబంధించి ప్రభుత్వం నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ లోగా కొత్త పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

పెయ్యేరు పంచాయతీలో డిడిఒ విచారణ


రికార్డులు పరిశీలిస్తున్న డిడిఒ లక్ష్మి

ముదినేపల్లి : మండలంలోని పెయ్యేరు పంచాయతీలో గతంలో జరిగిన అవకతవకలు, నిధుల దుర్వినియోగానికి సంబంధించి గ్రామస్తుడు దూబ చంద్రకాంత్ కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదుల మేరకు పంచాయతీలో బుధవారం విచారణ నిర్వహించారు. డిడిఒ (డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) లక్ష్మి ఆధ్వర్యంలో సచివాలయంలో విచారణ చేపట్టారు. విచారణకు గ్రామ సర్పంచి అల్లు సుశీల, అప్పటి కార్యదర్శి వై.శ్యామ్‌సుందర్, ఫిర్యాదు దారు చంద్రకాంత్ హాజరయ్యారు. గత ఐదేళ్లుగా పంచాయతీలో ఇంటి పన్నులు, ప్రయివేట్ నీటి కుళాయిల డిపాజిట్ పంచాయతీ ఖాతాకు జమ చేయకుండా నిధులు దుర్వినియోగం జరిగాయని ఫిర్యాదుదారు చంద్రకాంత్ డిడిఒ లక్ష్మి దృష్టికి తీసుకొచ్చారు. 2013 నుంచి 2024 వరకు పంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని డిడిఒను చంద్రకాంత్ కోరారు. ఇదిలా ఉండగా మధ్యలో సర్పంచి సుశీల చెక్ పవర్ రద్దయినట్లు, ఈ విషయం కోర్టులో ఉన్నట్లు డిడిఒ దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో ఆమె మాట్లాడుతూ కోర్టులో ఉన్న విషయంపై విచారణ చేయకూడదని, ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వచ్చే ఆదేశాల మేరకు విచారణకు పంచాయతీకి వస్తానని ఫిర్యాదుదారు చంద్రకాంత్‌తో డిడిఒ అన్నారు. పంచాయతీ రికార్డులను సీజ్ చేసి డిడిఒ బృందం తమ వెంట తీసుకెళ్లారు.

కౌలు రైతులకు రుణాలివ్వాలని వినతి

ఏలూరు అర్బన్ : కౌలు గుర్తింపు కార్డు ఉన్న రైతులకు పంట రుణాలు బ్యాంకులో ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎపి కౌలు రైతు సంఘం, ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ నాయకత్వంలో సంఘ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ నీలాద్రిని బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌలు రైతులు, సంఘాల నాయకులు, బ్యాంకర్స్‌తో కలిపి మండల స్థాయిలో సంయుక్త సమావేశాలు నిర్వహించాలని కోరారు. కౌలు గుర్తింపు కార్డులు ఉండి, వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులకు బ్యాంకుల నుంచి వ్యవసాయేతర రుణాలు మంజూరు చేయాలని కోరారులీడ్ బ్యాంక్ మేనేజర్ నీలాద్రి మాట్లాడుతూ కౌలు రైతులకు పంట రుణాలు బ్యాంకుల ద్వారా ఇచ్చేందుకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ఏమైనా ఇబ్బంది ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు టెక్కలపాటి ప్రసాదరావు, బికెఎంయు, ఎఐటియుసి నాయకులు పాల్గొన్నారు.

అర్హులైన వికలాంగులు పూర్తి పెన్షన్ పొందేలా కృషి

ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు

భీమడోలు : పూర్తిస్థాయి పెన్షన్ పొందేందుకు అర్హత ఉన్నప్పటికీ, వివిధ కారణాల వల్ల సాధారణ పెన్షన్ పొందుతున్న వికలాంగులకు న్యాయం చేసేందుకు నియోజకవర్గ పరిధిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వేదికలుగా ప్రత్యేక నిర్ధారణ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు తెలి పారు. దీనిలో భాగంగా గుండుగొలను పిహెచ్‌సి వద్ద వైద్యులు జాహ్నవిరెడ్డి పర్యవేక్షణలో కైకలూరు సిహెచ్‌సికి చెందిన ఎముకల వైద్య నిపుణుల ఆధ్వర్యంలో తక్కువ పెన్షన్ వస్తున్న వికలాంగులకు వైద్య పరీక్షల క్యాంపును బుధవారం ఏర్పాటు చేశారు. క్యాంపు పనితీరును ఎంఎల్ఎ పరిశీలించారు. ఏలూరు కాలువపై గుండుగొలను వద్ద నిర్మాణమవుతున్న నూతన వంతెన ప్రగతి గురించి అధికారులతో మాట్లాడారు. గుండుగొలను సొసైటీ చైర్ పర్సన్ కొండ బాబు, జనసేన మండలాధ్యక్షులు మదన్ పాల్గొన్నారు.

భీమడోలులో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలులో మాధురి కళాశాల ఆధ్వర్యంలో బుధవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, అతిథులుగా భీమడోలు సిఐ యుజె.విల్సన్ హాజరయ్యారు. కళాశాల విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకుల భాగస్వామ్యంతో కళాశాల నుంచి భీమడోలు జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రముఖులు శరణాల మాలతీ రాణి పాల్గొన్నారు.

E.C సర్టిఫికేట్ పోయినది

ఖండవల్లి మావుళ్ళమ్మ, భర్త, వంశీకృష్ణ, డోర్ నెంబర్ 5-104, వేలివెన్ను, ఉండ్రాజవరం మండలం, ప.గో.జిల్లా, ఎ.పి ప్రజలకు తెలియ జేయునది ఏమనగా నేను ది 08-03-2017 లో వైజాగ్ పాస్ పోర్ట్ ఆఫీస్ నుంచి P8706580 నెంబర్ పాస్ పోర్ట్ పొంధియున్నాను. అయితే నా పాస్ పోర్ట్ కువైట్ దేశంలో పోగొట్టుకున్నాను. దానితో నేను ఎమెర్జెన్సీ సర్టిఫికెట్ (E.C) మీద ఇండియాకు తిరిగి వచ్చాను.నేను తిరిగి కువైట్ వెళ్ళుటకు ది 20-07-2025న వేలివెన్ను లోని మాఇంటి నుంచి పాలకొల్లు మండలం లంకల కోడేరు బైక్‌పై వస్తుండగా నేను కువైట్ దేశంలో పొందిన నా ఒరిజినల్ E.C. సర్టిఫికెట్ తేదీ.05-11-2019 (నెంబర్ X0576418) దారిలో పడిపోయింది. ఎంత వెతికిన ఎక్కడ నా EC సర్టిఫికెట్ దొరకలేదు. ఎవరికైన దొరికినపై నా అడ్రస్‌కు అందజేయగలరు.

నా సెల్ నెంబర్ 8977868387

ప్రత్యామ్నాయ పిటీషన్ నోటీసు ప్రకటన
మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
E.A.No.44/2022 in
E.P.No.31/2019 in
O.S.No.64/2011

Between:
1.శ్రీమతి కంకిపాటి నరసమ్మ
2.కంకిపాటి రత్నం రాజు ...Petitioners/DHRs
Vs
తప్పెట్ల రామకృష్ణ మరియు 12 మంది వగైరా ...Resondents/JDRs

To.
ప్రత్యామ్నాయ పిటీషన్ నోటీసు ప్రకటన అమలు జరగవలసిన రెస్పాండెంట్ పేరు మరియు చిరునామా :
12వ రెస్పాండెంట్ :
తప్పెట్ల కృష్ణ వంశీ, తండ్రి రామకృష్ణ, వయస్సు 22 సం॥లు, స్టూడెంట్, R/o.పాటిమీద, కవిటం, పోడూరు మండలం, ప.గో.జిల్లా.

శ్రీ కోర్టు వారు ది.28-07-2025 సం. తేదీన జారీ చేసిన ఉత్తర్వులను అనుసరించి, E.A.No.44/2022 in E.P.No.31/2019 in O.S.No.64/2011 రులో ఈ పిటీషనులో మీ హాజరుకై వాయిదా ది.**28-08-2025** సం. తేదీ అయినందున, ఈ తేదీన ఉదయం 10.30 గం.లకు మీరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పైతెల్పిన కోర్టు వారి యెదుట స్వయముగా గానీ, న్యాయవాది ద్వారా గాని హాజరయి మీకు ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకోవచ్చును లేని యెడల మీ పరోక్షమున తదుపరి గ్రంథము జరుపబడును.

చెరుకూరి మురళీధరరావు
పాలకొల్లు అడ్వకేట్, పాలకొల్లు.
తేది.11-08-2025 సెల్: 9948222515

ప్రత్యామ్నాయ పిటీషన్ నోటీసు ప్రకటన
మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
E.A.No.45/2022 in
E.P.No.31/2019 in
O.S.No.64/2011

Between:
1.శ్రీమతి కంకిపాటి నరసమ్మ
2.కంకిపాటి రత్నం రాజు ...Petitioners/DHRs
Vs
తప్పెట్ల రామకృష్ణ మరియు 12 మంది వగైరా ...Resondents/JDRs

To.
ప్రత్యామ్నాయ పిటీషన్ నోటీసు ప్రకటన అమలు జరగవలసిన రెస్పాండెంట్ పేరు మరియు చిరునామా :
12వ రెస్పాండెంట్ :
తప్పెట్ల కృష్ణ వంశీ, తండ్రి రామకృష్ణ, వయస్సు 22 సం॥లు, స్టూడెంట్, R/o.పాటిమీద, కవిటం, పోడూరు మండలం, ప.గో.జిల్లా.

శ్రీ కోర్టు వారు ది.28-07-2025 సం. తేదీన జారీ చేసిన ఉత్తర్వులను అనుసరించి, E.A.No.45/2022 in E.P.No.31/2019 in O.S.No.64/2011 రులో ఈ పిటీషనులో మీ హాజరుకై వాయిదా ది.**28-08-2025** సం. తేదీ అయినందున, ఈ తేదీన ఉదయం 10.30 గం.లకు మీరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పైతెల్పిన కోర్టు వారి యెదుట స్వయముగా గానీ, న్యాయవాది ద్వారా గాని హాజరయి మీకు ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకోవచ్చును లేని యెడల మీ పరోక్షమున తదుపరి గ్రంథము జరుపబడును.

చెరుకూరి మురళీధరరావు
పాలకొల్లు అడ్వకేట్, పాలకొల్లు.
తేది.11-08-2025 సెల్: 9948222515

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT ELURU
A.A.C.F NO: 104/2021

Between:-
M/s. Shriram Chits (India) Pvt.Ltd.,Eluru (formerly known as M/s. Shriram Chits Pvt.Ltd,.. Eluru) ...**Petitioner/DHr**
And
Kondeti Venkata Ramu and others ...Respondents/Opponents

3. Durvasula. Rama Satya Srinivas, S/o Gowriswara Rao, Hindu, Male,a/a 39years, R/o.D.No.22B-3-16,Opp.Ambica Bhavan,Power Peta, Eluru, W.G.Dist. O/oVeterinary Dispensary, Sanivarapu Peat, Eluru,W.G.Dist,
4. Bandadu. Rajarajeswari, D/o RamaRao, Hindu, Female, a/a 47 Years; R/oD.No.6-78, Near Galigopuram,Sanivarapu Peta, Eluru,W.G.Dist. O/o Live Stock Assistant, Rural Live Stock Unit,Bandamcherla, T.Narsapuram Mandal,W.G.Dist.

పై నంబరు దావాలో అపోనెంట్స్ **OP3 to OP4** అయిన మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు వారు మీ హాజరు నిమిత్తం **ది.29-08-2025వ** తేదీన వాయిదా వేసినారు. కావున ఆ రోజున ఉదయం **10-30ని॥లకు** శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు వారు ఎదుట వ్యక్తిగతంగా గాని ,ప్లీడరు ద్వారా గాని హాజరై సంజాయిషీ ఇచ్చుకోగలరు. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేదీ.29-08-2025

(శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ వారి ఉత్తర్వుల ప్రకారం) M/S శ్రీ రామ్ చిట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, మేనేజర్ అడ్వకేట్ ఫర్ డిస్పూటెంట్

E.SRINIVASA BABU
ADVOCATE,ELURU

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT ELURU
A.A.C.F NO: 81/2024

Between:-
M/s. Shriram Chits (India) Pvt.Ltd.,Eluru (formerly known as M/s.Shriram Chits Pvt. Ltd,.. Eluru) ...**Petitioner/DHr**
And
Nagireddy. Uma Devi & others
...**Respondents/Opponents**

1.NagireddyUmaDevi W/o Ganga dhara Rao,Hindu,FeMale, a/a 59years,D.No4-82 Near Datta Asramam Dondapadu Eluru.
2. Nagireddy Gangadhara Rao, S/o Venkateswara Rao, Male, a/a 73years,D.No.4-82 Near Datta Asramam, Dondapadu,Eluru.
3. Nagireddy Gayatri, s/o Ganga dhara rao, Female, a/a 25 years, D.No.4-82,Near Datta Asramam Dondapadu, Pedavegi Mandal, Eluru.

పై నంబరు దావాలో అపోనెంట్స్ **OP1 to OP3** అయిన మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు వారు మీ హాజరు నిమిత్తం **ది.29-08-2025వ** తేదీన వాయిదా వేసినారు. కావున ఆ రోజున ఉదయం **10-30ని॥లకు** శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు వారు ఎదుట వ్యక్తిగతంగా గాని ,ప్లీడరు ద్వారా గాని హాజరై సంజాయిషీ ఇచ్చుకోగలరు. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేదీ.29-08-2025

(శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ ఆర్బిట్రేటర్ వారి ఉత్తర్వుల ప్రకారం) M/S శ్రీ రామ్ చిట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, మేనేజర్ అడ్వకేట్ ఫర్ డిస్పూటెంట్

E.SRINIVASA BABU
ADVOCATE,ELURU